సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



పవర్ హౌస్‌లోకి వరద

భారీ వర్షాలతో పొల్లూరు జలవిద్యుత్తు కేంద్రానికి వరద పోటెత్తడంతో బ్యాంక్ వాటర్ వల్ల పంపు హౌస్‌లోకి నీరు చేరింది. 8లో



లింగ వివక్ష లేని సమాజం నిర్మిద్దాం 8లో

లింగ వివక్ష లేని సమాజం కోసం ట్రైనింగ్ డైరెక్టర్ మస్తాన్‌రావు పిలుపునిచ్చారు.



శ్రీస్కంద గణపతిగా సంపత్ వినాయగర్ 8లో

న్యూస్‌రీల్

నేడు విద్యా సంస్థలకు సెలవు

సాక్షి, పాడేరు: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలకు సెలవు వర్తిస్తుందన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు తెరిస్తే చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పంపవద్దని, మారుమూల ప్రాంతాల్లో విద్యార్థులు గెడ్డలను దాటి ప్రయాణాలు చేయవద్దని సూచించారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు కురుస్తుండంతో ప్రధాన గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కల్వర్టులు కొట్టుకుపోవడంతో పాటు రోడ్డుపైకి కొండచరియలు విరిగిపడిన ఘటనలతో రవాణాకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలతో కలెక్టరేట్‌తో పాటు ఐటీడీఏ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.

జిల్లాలో 317.6 మిల్లీమీటర్ల వర్షపాతం..

జిల్లాలో సోమవారం సాయంత్రానికి 317.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంచంగిపుట్టులో 50.2, పెదబయలు 30, డుంబ్రిగుడ 21, అరకులోయ 20.4, అనంతగిరి 8.6, హుకుంపేట 14.2, పాడేరు 1.6, జి.మాడుగుల 37.4, చింతపల్లి 1.6, జి.కె.వీధి 5, కొయ్యూరు 5.2, మారేడుమిల్లి 17, దేవీపట్నం 7, వై.రామవరం 9.8, అడ్డతీగల 9, రాజవొమ్మంగి 7.4, గంగవరం 7.2, రంపచోడవరం 6.4, ఏటపాక 14.2, కూనవరం 17.4, చింతూరు 18.6, వి.ఆర్.పురం 8.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

వరద నష్టాన్ని గుర్తించండి: ఎమ్మెల్యే మత్స్యలింగం



అరకులోయ టౌన్: తుపాను వర్షాలకు అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గంలో అన్ని రకాల నష్టాన్ని అంచనా వేయాలని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తహసీల్దార్లకు సూచించారు. సోమవారం ఆయన ఆరు మండలాల తహసీల్దార్లతో మాట్లాడారు. రెండు వారాలుగా కురుస్తున్న భారీ వర్షాలతో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని అన్ని గ్రామాల్లో పంట నష్టం, ఇళ్లు కూలిపోయిన వాటిని గుర్తించాలన్నారు. రహదారులు, వంతెనలు, కాజ్‌వేలు కొట్టుకుపోతే వాటి వివరాలు అందజేయాలని సూచించారు. పూర్తి నివేదిక అందజేస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. బాధితులకు తక్షణ సహాయం కోసం చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

లోయలో పడిన బస్సు వెలికితీత



లోయలో నుంచి ఆర్టీసీ బస్సును యంత్రాల సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలోని బోర్నగూడెం వద్ద రహదారి పక్కనే లోయలోకి దూసుకుపోయిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సును సోమవారం సాయంత్రం సంబంధిత యంత్రాంగం వెలికి తీసింది. ఇందుకోసం వారు ఓ భారీ క్రేన్‌ను ఉపయోగించారు. 25 మంది ప్రయాణికులతో ఆదివారం రాజమహేంద్రవరం నుంచి రాజవొమ్మంగి మీదుగా నర్సీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి లోయలోకి పడిపోయిన సంగతి తెలిసిందే. స్థానిక సీఐ సన్యాసినాయుడు పర్యవేక్షణలో రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ షబ్నమ్, ఏలేశ్వరం డిపో మేనేజర్ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు రాజు, హరిబాబు రావు పర్యవేక్షణలో లోయలో బస్సును సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ప్రమాదంలో గాయపడిన వారు ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయినట్లు డీఎం షబ్నమ్ తెలిపారు.

సీఐల బదిలీ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ పరిధిలో 9 మంది సీఐలను బదిలీ చేశారు. వీరిలో ఒకరిని వీఆర్‌కు పంపించారు. వీఆర్‌లో ఉన్న ఆరుగురికి వివిధ జిల్లాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ఇద్దరిని రేంజ్ వీఆర్ నుంచి జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. ఈమేరకు సోమవారం విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టీ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సీపట్నం టౌన్‌లో పనిచేస్తున్న త్రిపురాన క్రాంతికుమార్‌ను వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న సీఐ వానపల్లి నాగరాజును శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐగా, ఎంవీవీ రమణమూర్తిని విజయనగరానికి, బుచ్చిరాజును అనకాపల్లి పీసీఆర్ సీఐగా, జి.దుర్గాప్రసాద్‌ను అల్లూరి సోషల్ మీడియా సైబర్‌సెల్ సీఐగా, జి.ఆర్.కె.టి.తులసీదాస్‌ను శ్రీకాకుళం డీటీసీకి, సువ్వారి రామును అల్లూరి ఎన్‌డీపీఎస్ టాస్క్‌ఫోర్స్ సీఐగా, గంగుల గోవిందరావును నర్సీపట్నం టౌన్ సీఐగా, షేక్ గఫూర్‌ను అనకాపల్లి వీఆర్‌కు బదిలీ చేశారు.

ఊహించని ఉత్పాతం

అర్ధరాత్రి సమయంలో ఊహించని ఉత్పాతం.. నాలుగు కొండల మధ్య నుంచి భారీ ఎత్తున వరద నీటితోపాటు పెద్ద పెద్ద బండరాళ్లు, భారీ వృక్షాలు కొట్టుకు చ్చాయి. దాంతో భయంతో ఇళ్లలో తలదాచుకున్న గిరిజనులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏమైందో తెలియక రాత్రంతా కలత నిద్రలోనే గడిపారు. ఈ క్రమంలోనే గిరిజన కుటుంబంపై కొండ చరియలు విరిగిపడి ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

- పలుచోట్ల భారీగా విరిగిపడ్డ కొండ చరియలు
- ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు
- కొట్టుకొచ్చిన బండరాళ్లు, మట్టిదిబ్బలు
- అర్ధరాత్రి భయం గుప్పెట్లోనే గిరిజనులు



సంఘటనా స్థలానికి చేరుకోలేక మార్గమధ్యలోనే ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్



కొండచరియల ధాటికి ధ్వంసమైన ఇళ్లు

సీలేరు: అల్లూరి జిల్లా ప్రకృతి అందాలకు పెట్టింది పేరు.. పచ్చని కొండల్లో ప్రశాంతమైన వాతావరణం నడుమ గిరిజనులు జీవనం సాగిస్తుంటారు. వ్యవసాయాన్ని నమ్ముకుంటూ కొండల ప్రాంతంలో గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఇటువంటి సమయంలో తుఫాన్ కారణంగా నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం అర్ధరాత్రి ప్రశాంతంగా నిద్రిస్తున్నారు. ఈ సమయంలో ఊహించని రీతిలో నాలుగు కొండల మధ్య నుంచి ఒక్కసారిగా భారీ వర్షంతో వరద ఉధృతంగా ప్రవహించడంతో భయంతో తలదాచుకున్న గిరిజనులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జీకే వీధి మండలం 16 పంచాయతీలతో పాటు ఒడిశా సరిహద్దు గిరిజన గ్రామాల్లో భారీ ఎత్తున వరద నీటితోపాటు పెద్దపెద్ద బండరాళ్లు, భారీ వృక్షాలు కొట్టుకుచ్చాయి. ఈ క్రమంలో చత్రాపల్లి అనే గిరిజన గ్రామంలో గిరిజన కుటుంబంపై కొండ చరియ విరిగిపడింది. నిద్రిస్తున్న సమయంలోనే కుమారి(27) మృతి చెందగా, కొర్ర పండన్న(60), సుమిత్ర(18), సుబ్బారావు(25) కొండ చరియలో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలయ్యాయి. ఏమి జరుగుతుందో తెలియక చుట్టు పక్కల వారు భయంతో ఇళ్లలో నుంచి బయటకు రాలేక అర్ధరాత్రి అంతా కలత నిద్రలోనే గడిపారు. సోమవారం ఉదయం వర్షం తగ్గేటప్పటికీ బయటకు వచ్చి విషయం బాహ్య ప్రపంచానికి తెలిసింది.

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు...

చత్రపల్లి గ్రామంలో కొండ చరియలు విరిగిపడి ఘటనలో తక్షణమే సహాయ చర్యలు అందించాలని దిగువ స్థాయి అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. పీవో, సబ్ కలెక్టర్, మండల స్థాయి అధికారులు లంకపాకల నుంచి బయలుదేరగా, మార్గమధ్యలో రెండు చోట్ల రహదారి కొట్టుకుపోవడంతో ఆ గ్రామానికి వెళ్లేందుకు వీలు లేకపోయింది.

మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

గాయపడిన వారికి మెరుగైన వైద్యం: కలెక్టర్

సాక్షి, పాడేరు: జి.కె.వీధి మండలం గాలికొండ పంచాయతీ చత్రాపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కొండచరియలు విరిగిపడిన ప్రమాద ఘటన చాలా బాధాకరమని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో మృతి చెందిన కొర్రా కుమారికి జాతీయ, రాష్ట్ర విపత్తుల సంస్థ నిబంధనల మేరకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన కొర్రా పండన్న, కొర్రా సుమిత్ర, కొర్రా సుబ్బారావులను ఆస్పత్రులకు తరలించి మెరుగైన వైద్య సేవలు కల్పిస్తున్నామన్నారు. గ్రామంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఇళ్లు నేలకూలిన బాధిత గిరిజన కుటుంబాలకు పునరావాస చర్యలు చేపడతామని తెలిపారు.

భారీ వర్షంతో అతలాకుతలం

- ఘాట్ రోడ్డులో విరిగిపడ్డ కొండచరియలు
- భయాందోళనలో గిరిజనులు



కూలీలను వాగు దాటిస్తున్న స్థానికులు



విరిగిపడ్డ కొండచరియలు

సీలేరు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం అంతటా భారీ వర్షాలతో అతలాకుతలమైంది. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఒక్కసారిగా ఊహించని రీతిలో వర్షం ముంచెత్తింది. దీంతో గ్రామాల నలుమూలల నుంచి వరద నీరు గ్రామంలోకి చొచ్చుకొచ్చింది. వయనాడ్ తరహాలో ఈ ప్రాంతం అంతటా కొండచరియలు విరిగిపడటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సీలేరు నుంచి ధారకొండ వెళ్లే ప్రధాన అంతర్రాష్ట్ర రహదారిలో 20 చోట్ల కొండలపై నుంచి బండరాళ్లు, భారీ వృక్షాలతో మట్టి దిబ్బలు దొర్లుకుంటూ పడిపోయాయి. దీంతో ఎటుచూసినా భయాందోళనకు గురయ్యారు. సోమవారం ఉదయం విషయాన్ని కలెక్టర్‌కు, ఐటీడీఏ పీవోకు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అప్పటికే వర్షం కొనసాగుతుండటంతో సహాయ చర్యలు చేపట్టలేకపోయారు. సీలేరు చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా బంగాళాఖాతంలో వాయుగుండం తీరం దాటే సమయంలో ప్రకృతి విరుచుకుపడింది.

పిల్లిగడ్డ వంతెన వద్ద చిక్కుకున్న కూలీలు

ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రజల రాకపోకలకు వీలుగా చేపడుతున్న పిల్లిగడ్డ వంతెన నిర్మాణం కోసం రోజు ఐదుగురు కూలీలు ఉంటారు. ఇక్కడ ఆదివారం రాత్రి చుట్టు పక్కల నుంచి భారీగా వరద చేరటంతో వీరు చిక్కుకుపోయారు. వాళ్లంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఒకరికొకరు సాయంతో కొండంచుకు చేరుకుని అర్ధరాత్రి అంతా అక్కడే ఉండిపోయారు. ఉదయం 10 గంటల సమయంలో ఇద్దరు స్థానికుల సహాయంతో ఒడ్డుకు వచ్చి ఐదు కిలోమీటర్ల మేర విరిగిపడ్డ కొండచరియలు దాటుకుంటూ సీలేరు చేరుకున్నారు.

గిరిశిఖర ప్రజలను అప్రమత్తం చేయాలి

కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ్

సాక్షి, పాడేరు: తుపాను వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని గిరిశిఖర గ్రామాలు, కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన అన్ని మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలతో ఏర్పడిన నష్టాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులు, వంతెనలు తెగిపోయిన ప్రాంతాలను గుర్తించి, 24 గంటల్లో పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అన్ని ఇంజనీరింగ్ శాఖలను ఆదేశించారు. ప్రజలు వాగులు, గెడ్డలు దాటకుండా చైతన్య పరచాలన్నారు. వాటి వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని భద్రతగా ఉంచాలన్నారు. పాడేరు డివిజన్‌లో 9, రంపచోడవరం డివిజన్‌లో 7 చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. జిల్లాలోని ఐదు ఘాట్ రోడ్లలో వాహనాల రవాణా నిషేధం పొడిగించాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర సర్వీసులు, నిత్యావసర వస్తువుల రవాణాకు మాత్రమే అనుమతులు ఇవ్వాలన్నారు. జోలాపుట్టు డ్యామ్ 7 గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారని, లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. చింతూరు డివిజన్‌లోని శబరి నదికి 38 అడుగుల నీటిమట్టం పెరిగినందున ముంపు గ్రామాల బాధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలని ఆదేశించారు. రంపచోడవరం డివిజన్‌లోని అన్ని మండలాల్లో నీటి ప్రవాహాలు అధికంగా ఉన్నాయని, చెట్లు నేలకూలే పరిస్థితిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని ప్రాంతాలలో పాత భవనాలు, మట్టి ఇళ్లు, కల్వర్టులు, కాజ్‌వేలు పరిశీలించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ గౌడ్, ఎస్పీ అమిత్‌బర్దర్, ఐటీడీఏల పీవోలు కట్టా సింహాచలం, అపూర్వ భరత్, సబ్ కలెక్టర్లు కల్పశ్రీ, సౌర్యమన్‌పటేల్, డీఆర్‌వో పద్మావతి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

విద్యార్థుల మెనూలో నాణ్యత పాటించాలి

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: విద్యార్థులకు అందించే మెనూలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని ఆశ్రమ పాఠశాలలు, జూనియర్ కళాశాల వార్డెన్లతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలల వారీగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహారం వేడిగా నాణ్యతగా ఉండాలన్నారు. వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి, వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, రక్తహీనత బారిన పడే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. చదువుతోపాటు మంచి నడవడిక నేర్పాలని, ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం పలు సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లగా, ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, జిల్లా గరల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.సూర్యకుమారి, ఏటీడబ్ల్యూవో స్వర్ణలత, ఎంఈవో కృష్ణమూర్తి, హెచ్‌ఎంలు రాజేశ్వరి, నిర్మల పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో వరదనీరు విడుదల

డుడుమ నుంచి 40 వేలు, జోలాపుట్టు నుంచి 50 వేల క్యూసెక్కులు విడిచిపెట్టిన అధికారులు



ముంచంగిపుట్టు: జోలాపుట్టు నుంచి డుడుమకు భారీగా విడుదలవుతున్న నీరు

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే ప్రధాన డుడుమ, జోలాపుట్టు జలాశయాలకు భారీగా వరదనీరు చేరి ఉగ్రరూపం దాల్చింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు జలాశయాల నీటిమట్టాలు పూర్తిగా నిండిపోయి ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2,590 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 2,589.40 అడుగులుగా నమోదయింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది 3, 5, 7, 8 నంబర్ల గేట్లను పైకెత్తి 40 వేల క్యూసెక్కుల నీటిని దిగువన బలిమెల జలాశయానికి విడుదల చేస్తున్నారు. డుడుమ జలాశయ ఎగువన జోలాపుట్టు జలాశయ నీటిమట్టం సైతం ప్రమాద స్థాయికి చేరుకుంది. జలాశయ నీటి సామర్థ్యం 2,750 అడుగులు కాగా సోమవారం రాత్రి 7 గంటలకు 2,749.20 అడుగులు నీటి నిల్వ ఉంది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఒడిశా స్పిల్‌వే జలాశయం నుంచి 6 గేట్లు ఎత్తి 44,500, ఆంధ్ర ప్రధాన జలాశయం నుంచి 4,500 చొప్పున మొత్తం జోలాపుట్టు జలాశయం నుంచి 50 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నీటి మట్టాలు పెరుగుదల బట్టి జలాశయాల నుంచి నీటి విడుదల పెంచుతూ వస్తున్నారు. జోలాపుట్టు, డుడుమ జలాశయాల చరిత్రలో ఇంత స్థాయిలో వరదనీరు రావడంతో పాటు విడుదల చేయడం ఇదే మొదటి సారిగా అధికారులు చెబుతున్నారు.



ముంచంగిపుట్టు: డుడుమ నుంచి బలిమెలకు ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

వరదతో నిలిచిన రాకపోకలు

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతం ఒడిశా నుంచి వస్తున్న వర్షపునీటితో నదులు, వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దాంతో పలుచోట్ల రాకపోకలు స్తంభించాయి. పంట పొలాలు నీట ముంపునకు గురయ్యాయి. అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపడుతున్నారు.

- శబరి, గోదావరి ఉగ్రరూపం
- గ్రామాల్లోకి ప్రవేశిస్తున్న వరదనీరు
- నీట మునిగిన పొలాలు



జి. మాడుగుల మండలం సుబ్బులు–మండిభ మధ్య కొట్టుకుపోయిన రోడ్డు కమ్ కల్వర్టు



శబరి బ్రిడ్జి వద్ద అందుబాటులో ఉంచిన లాంచీలు

చింతూరు: డొంకరాయి జలాశయం వరదనీరుతోపాటు ఎగువనున్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో కురిసిన భారీ వర్షాలకు వస్తున్న నీటితో శబరినది సోమవారం ఉదయం ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. డొంకరాయి జలాశయం నుంచి ఏడు గేట్లను ఎత్తి 1.10 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. ఆ నీరంతా సీలేరు నది ద్వారా వచ్చి చింతూరు మండలం కల్లేరు వద్ద శబరినదిలో కలుస్తోంది. ఈ నీటికి శబరినది నీరు తోడవడంతో కుయిగూరు వాగు పొంగి వరదనీరు జాతీయ రహదారి–326ను ముంచెత్తడంతో ఆంధ్రా నుంచి ఒడిశాకు, వీరాపురం, చట్టి వద్ద వరదనీరు జాతీయ రహదారి–30 పైకి చేరడంతో ఆంధ్రా నుంచి ఛత్తీస్‌గఢ్, తెలంగాణకు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం రాత్రికి చింతూరు వంతెన వద్ద శబరినది నీటిమట్టం 41 అడుగులకు చేరుకుంది. మరోవైపు పలు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. చింతూరు మండలంలో కుయిగూరు, సోకిలేరు, జల్లివారిగూడెం, చంద్రవంక, చీకటివాగులు పొంగి వరదనీరు రహదారుల పైనుంచి ప్రవహిస్తోంది. దీంతో చింతూరు నుంచి వీఆర్‌పురం, కూనవరం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ చింతూరు మండలంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. భారీ వర్షానికి చింతూరు మండలం చట్టిలో తాటాకిల్లు పడిపోగా, తూలుగొండలో చింతచెట్టు పడడంతో రేకుల ఇల్లు ధ్వంసమైంది.

కొండ్రాజుపేట కాజ్‌పై వరద ప్రవాహం

కూనవరం: రెండు రోజుల క్రితం శాంతించిన గోదావరి వరద సోమవారం నుంచి మళ్లీ పెరుగుతోంది. కొండ్రాజుపేట కాజ్‌వేపైకి వరద నీరు చేరడంతో కొండ్రాజుపేట– టేకులబోరు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. సాయంత్రం 6.00 గంటలకు కూనవరం వద్ద గోదావరి నీటి మట్టం 28.6 అడుగులకు చేరుకోగా, భద్రాచలం వద్ద 29.6 అడుగులకు చేరింది. వాగులు దాటే ప్రయత్నం చేసినా, చేపలు పట్టేందుకు వెళ్లినా సహించేది లేదని తహసీల్దార్ నాగబాబు, ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



చింతూరు మండలం కల్లేరుకు చెందిన గర్భిణులను పడవలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



చింతపల్లి మండలం మడిగుంట గ్రామం వద్ద కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు



కొయ్యూరు మండలం కాకరపాడు కాలువ దగ్గర నిలిచిపోయిన నర్సీపట్నం, ఏలేశ్వరం బస్సులు

కొండ కాలువలు దాటే ప్రయత్నం చేయకండి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



వాగును పరిశీలిస్తున్న పీవో సింహాచలం

రంపచోడవరం: తుఫాన్ ప్రభావం వల్ల ఏజెన్సీలోని కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. భూపతిపాలెం ప్రాజెక్టు నీటి ఉధృతిని సోమవారం ఆయన పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఎన్ని క్యూసెక్కులు దిగువకు విడిచి పెడుతున్నారు, వంటి విషయాలను చర్చించారు. దిగువన ఉన్న వారిని అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. భూపతిపాలెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసినప్పుడు కాలువ పరివాహక ప్రాంత గ్రామాల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటిని వదిలినప్పుడు సైరన్ శబ్దాన్ని ఎక్కువ సేపు ఉంచాలన్నారు. ప్రాజెక్టు నీటిని వదలడంతో రంపచోడవరం– రంప గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సీతపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పీవో వాగును సందర్శించి ఎవరూ వాగును దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. వాగు ఉధృతి తగ్గే వరకు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు.



భూపతిపాలెం ప్రాజెక్టు నుంచి నీరు విడుదల

క్లుప్తంగా

లింగ వివక్ష లేని సమాజం నిర్మిద్దాం

రాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్, ట్రైనింగ్ డైరెక్టర్ మస్తాన్‌రావు

ముంచంగిపుట్టు: లింగ వివక్ష లేని సమాజం నిర్మించేందుకు అందరూ కలిసి పని చేయాలని రాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్, ఏపీ ట్రైనింగ్ డైరెక్టర్ మస్తాన్‌రావు తెలిపారు. స్థానిక బాలిక పాఠశాలలో విద్యార్థినులు లింగ వివక్ష వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు, నివారణ చర్యలపై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో వర్క్ షాప్‌ను విద్యా శాఖ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మస్తాన్‌రావు మాట్లాడుతూ లింగ వివక్ష పూర్తిగా నివారించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. బాల బాలికలకు హక్కులు తెలియజేస్తూ, మానసిక వికాసానికి దోహదపడాలన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు బాలబాలికల ఫిర్యాదులను త ప్పనిసరిగా పరిశీలించి, పరిష్కారం చేయాల ని సూచించారు. కార్యక్రమంలో డీఈవో బ్ర హ్మాజీరావు, ఎంఈవో కృష్ణమూర్తి, గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సూర్యకుమారి, ప్రో గ్రామ్ కోఆర్డినేటర్ ధోఫా, సీఎంవో జ్ఞానప్రకాష్, ఏఎంవో భాస్కర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

జలాశయాల వద్ద అనుక్షణం అప్రమత్తం

సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్



తాజంగి రిజర్వాయరును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్

చింతపల్లి: పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ సోమవారం తాజంగి జలాశయాన్ని పరిశీలించారు. అనంతరం చింతపల్లి తహసీల్దారుతో మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో గుర్తించిన తాజంగి, పులిగొంది రిజర్వాయర్లతో పాటు సిరిపురం అంతర్ల, చౌడుపల్లి ప్రాంతాల్లో భారీ చెరువుల ద్వారా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని పంచాయతీ కేంద్రాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైనటువంటి గిరిజనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

ఉరకలెత్తిన జలాశయాలు

- ముంచెత్తిన వరదనీరు
- రిజర్వాయర్ల గేట్లు ఎత్తడంతో దిగువ ప్రాంతాలకు నీరు తరలింపు



అడ్డతీగల మద్దిగడ్డ జలాశయం గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడిచిపెట్టిన దృశ్యం



సీలేరులోని గుంటవాడ రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరదనీరు

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌కు సంబంధించి అన్ని రిజర్వాయర్లు వరదతో నిండిపోయాయి. గుంటవాగు రిజర్వాయరు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడిచిపెడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం అర్ధ రాత్రి నుంచి కురిసిన భారీ వర్షంతో కొండల్లో నుంచి వచ్చిన వరద నీరు రిజర్వాయర్లకు చేరి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమై గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేశారు. ఈ క్రమంలో పిల్లిగడ్డ వాగు నుంచి భారీగా వర్షపునీరు రావటంతో గుంటవాగు రిజర్వాయరు అర్ధరాత్రి పూర్తిగా నిండిపోయింది. ఇక్కడ ఇన్‌ఫ్లో 18 వేలు క్యూసెక్కులు రాగా, ఆ నీటిని ఐదు గేట్లు ఎత్తి దిగువకు మళ్లిస్తున్నారు. జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీరు రామభద్రరాజు, ఈఈ భాస్కర్‌రావు, ఏడీ అప్పలనాయుడు, ఏఈ సురేష్ ఎప్పటికప్పుడు రిజర్వాయర్లను పరిశీలిస్తున్నారు.

మద్దిగడ్డ జలాశయం నీరు విడుదల

అడ్డతీగల: భారీ వర్షాలకు మద్దిగడ్డ జలాశయం నిండిపోయింది. అదనపు వరద వస్తుండడంతో సోమవారం నుంచి మూడు ప్రధాన గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయానికి 1,850 క్యూసెక్కుల వరదనీరు వస్తుందని, 2 వేల క్యూసెక్కులు రోజూ దిగువకు వెళ్లేలా మూడు గేట్లను ఎత్తివేసినట్టు ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. జలాశయం ఎఫ్‌ఆర్‌ఎల్ లెవెల్ 188 మీటర్లు కాగా, ప్రస్తుతం 187.3 మీటర్లు నీటి నిల్వ ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. జలాశయం నీరు పెద్దేరు ద్వారా ఏలేరు వాగులో కలుస్తోందని, అందువల్ల ఏలేరు వాగులో పెద్దేరు, కన్నేరు ఏకమై ఇప్పటికే అధిక వర్షాల వల్ల ఉధృతంగా ప్రవహిస్తుందని చెప్పారు. పరీవాహక ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పింజరికొండ, కొత్తపాలెం, గడిచిన్నంపాలెం, కృష్ణవరం, ఉప్పలపాడు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.



కోతకు గురైన రిజర్వాయర్

ప్రమాద స్థాయిలో కొర్రాయి మినీ రిజర్వాయర్

డుంబ్రిగుడ: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొర్రాయి పంచాయతీలోని మినీ రిజర్వాయర్ ప్రమాద స్థాయికి చేరుకుంది. సామర్థ్యానికి మించి వరద ఉధృతి చేరడంతో రిజర్వాయర్ ముందు భాగం కోతకు గురవుతుందని సమీప గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా మినీ రిజర్వాయర్ నిర్వహణ బాధ్యతను గాలికి వదిలేయడంతో వర్షాల సమయంలో పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. సర్పంచ్ కొములునాయుడు సంబంధిత అధికారులకు ప్రమాద సమాచారం అందించడంతో ఇసుక బస్తాలతో ఉధృతిని తగ్గించేందుకు చర్యలు చేపట్టారు.

కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

చింతపల్లి: మండలంలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన మడిగంట అప్రోచ్ రోడ్డు మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం సాయంత్రం ఇక్కడ అప్రోచ్ రోడ్డు, కల్వర్టును పరిశీలించారు. నర్సీపట్నం నుంచి చింతపల్లి కేంద్రానికి రాకపోకలు సాగించడానికి వీలుగా నిర్మించిన కల్వర్టు ఆదివారం రాత్రి కొట్టుకుపోయింది. దీనికి వెంటనే మరమ్మతులు చేపట్టి వాహన రాకపోకలు సాగించే విధంగా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రాజుపాకలు, చింతలూరు, రింతాడ వద్ద అన్ని ప్రాంతాల్లో మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ మార్గంలో ఏ ఒక్కరూ ప్రమాదకరంగా రాకపోకలు సాగించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని పంచాయతీల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పంట, ఆస్తి నష్టం పరిస్థితిపై మండల కేంద్రానికి వివరాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు రామకృష్ణను ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ ఇ.వి.ఎస్.ఎస్. రాజు, డీఈ చాణిక్యరావు, తదితరులు పాల్గొన్నారు.



మడిగంట వద్ద కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డును పరిశీలిస్తున్న పీవో అభిషేక్

పక్కాగా ఓటర్ల జాబితా

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: స్థానిక సంస్థల ఎన్నికల లోపు పక్కాగా ఓటర్ల జాబితాను తయారు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమై ఓటర్ల జాబితా తయారీపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఇంటింటికీ ఓటర్ల నమోదుకు వెళ్లినప్పుడు 1,686 మంది అందుబాటులో లేరన్నారు. 390 మంది ఓటర్లు వలసపోయారని, 1,387 మంది మృతి చెందారని, 577 మంది ఓటర్లకు ఫొటోలు సక్రమంగా లేవన్నారు. మూడు నియోజకవర్గాల్లో 2,424 మందికి ఒకే రకమైన ఫొటోలు ఉన్నాయని,సవరించే పనులు చేపడతామన్నారు. బీఎల్‌వోలకు ఓటరు నమోదుపై శిక్షణ ఇస్తామని తెలిపారు. జేసీ డాక్టర్ అభిషేక్ గౌడ్, డీఆర్‌వో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



జి. మాడుగుల మండలం కొత్తపల్లి గ్రామం వద్ద వరదనీరు ఉరకలేస్తున్న జలపాతం

ముంచెత్తిన వర్షం

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గ్రామలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యావసర సరకుల కోసం గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గిరి గ్రామాలకు వరదనీరు ముంచెత్తింది. జలాశయాల్లో ఉధృతంగా వరదనీరు చేరడంతో గేట్లు ఎత్తి దిగువ ప్రాంతాలకు నీరు వదులుతున్నారు. పంటలన్నీ నీట మునిగాయి. కాజ్‌వేలు, కల్వర్టులు, వంతెనలు కొట్టుకుపోయాయి. కొన్ని ప్రాంతాల్లో మునుపెన్నడూ లేనంతగా వరద ముంచెత్తింది. రహదారులకు అడ్డంగా చెట్లు కూలాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గృహాలు దెబ్బతిన్నాయి. తుపాను ప్రభావంతో శబరి, గోదావరి నదులు పోటెత్తాయి. వరదనీరు లోతట్టు గ్రామాల్లో భారీగా చేరింది. ప్రమాదస్థాయిలో శబరి, గోదావరి నదులు ప్రవహించడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.జిల్లా అంతటా అతలాకుతలమైంది.



జి.మాడుగుల-లంబసింగి మార్గంలో కోతకు గురైన కల్వర్టుకు మరమ్మతులు



చింతూరు వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరినది



చింతూరు మండలంలో నీట మునిగిన వరిపంట



చింతూరులోని శబరిబడ్డు ప్రాంతాన్ని ముంచెత్తిన వరదనీరు



కూనవరంలో శబరి బ్రిడ్జి వద్ద ఉరకలేస్తున్న శబరి, గోదావరి నదులు

పొల్లూరు పవర్ హౌస్‌లోకి వరద

- బ్యాక్ వాటర్ వల్ల పరిస్థితి
- బచ్చులూరు వద్ద కొట్టుకుపోయిన రహదారి, బ్రిడ్జి
- వైజాగ్- భద్రాచలం వైపు నిలిచిపోయిన రాకపోకలు



పొల్లూరులో నీటి మునిగిన పంప్ హౌస్ షెడ్



డొంకరాయి డ్యామ్ నుంచి నీరు విడుదల



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో అండర్ గ్రౌండ్‌లో ప్రవేశించిన వరద నీరు

మోతుగూడెం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో లోయర్ సీలేరు జలాశయాలు పూర్తిస్థాయి నీటి మట్టం చేరుకున్నాయి. డొంకరాయి డ్యాం ద్వారా ఎనిమిది గేట్లు ఎత్తి 1.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి వరద ప్రవాహం ఉధృతంగా ఉండడంతో బ్యాక్ వాటర్ వల్ల పవర్ హౌస్‌లోకి నీరు చేరింది. దీంతో అప్రమత్తమైన జెన్‌కో అధికారులు డీవాటరింగ్ పంపులు ద్వారా నీటిని బయటికి పంపిస్తున్నారు. వరద ఉధృతి ఎక్కువవ్వడంతో పొల్లూరు, మోతుగూడెం మధ్య రోడ్డు పైకి చేరటంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలకు పొల్లూరు, మోతుగూడెం ఉద్యోగులకు తాగునీరు అందించే పంప్ షెడ్స్ రెండు వరద నీటిలో మునిగిపోయాయి. పొల్లూరు, వాటర్స్ ఫాల్స్ వద్ద తూలుకొండ గ్రామం వద్ద చెట్లు కూలిపోయాయి. పొల్లూరు వద్ద ఒడిశా, ఆంధ్రా సరిహద్దులో నిర్మిస్తున్న బ్రిడ్జి వరద ధాటికి పూర్తిగా మునిగిపోయింది. డొంకరాయి, సీలేరు మధ్య బచ్చులూరు గ్రామ వద్ద బ్రిడ్జి వద్ద రహదారి కోతకు గురై సీలేరు వెళ్లేందుకు రహదారి మూసుకుపోయింది. దీంతో వైజాగ్‌కు వెళ్లే మార్గం మూసుకుపోయింది. వరద ఉధృతికి పొల్లూరు గ్రామానికి బెంగాలీలకు చెందిన 20 కుటుంబాల చేపలు పట్టేందుకు వాడుకునే నాటు పడవలు, వలలు కొట్టుకుపోయాయి. తమ ఉపాధి పోయిందని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



పొల్లూరు వాటర్ ఫాల్స్ రహదారిలో కూలిన చెట్టును తొలగిస్తున్న జెన్‌కో ఉద్యోగులు

జీవించు.. సాధించు

వలలో చిక్కుకున్న చేపపిల్ల చివరి నిమిషం వరకూ తప్పించుకునే ప్రయత్నం చేస్తుంది. చిరుతపులి కూడా ఒంటినిండా తూటాలతోనే వేటగాడికి ఎదురొడ్డి నిలుస్తుంది. ఆకతాయి కుర్రాళ్లు కసిదీరా నలిపేసిన సీతాకోకచిలుక అయినా తెగిన రెక్కలతోనే మొండిగా ఎగరాలని చూస్తుంది. సృష్టిలో ఏ జీవికీ ఆత్మహత్య ఆలోచన రాదు – ఒక్క మనిషికే ఆ విపరీత బుద్ధి చిన్న సమస్య రాగానే తల్లడిల్లిపోతాడు. చావే నయమన్న భ్రమలో పడిపోతాడు. అక్షరాస్యులైనా.. నిరక్షరాస్యులైనా.. నిరుద్యోగి అయినా.. జీవితంలో స్థిరపడ్డ వారైనా.. చిన్నపాటి సమస్యకే బలవన్మరణాలకు ఆశ్రయిస్తున్నారు. ప్రేమ వైఫల్యం.. ఒంటరితనం.. నిరుద్యోగం.. ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ కలహాలు.. కారణమేదైనా ప్రాణాలు వదులుతున్నారు. జీవితాన్ని జయించలేక చావును చేరుకుంటున్నారు. నేడు 'ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం' సందర్భంగా ప్రత్యేక కథనం. –విశాఖ సిటీ



- ఆత్మహత్యలు వద్దు.. సమస్యల పరిష్కారానికి పోరాడదాం
- జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఆత్మహత్యలు
- బలవన్మరణాల్లో రాష్ట్రంలో రెండో స్థానంలో విశాఖ
- ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

జీవితంలో వెనక్కి తీసుకోలేనివి రెండే.. ఒకటి కాలం.. మరొకటి ప్రాణం. తొందరపాటు జీవితాన్ని చిదిమేస్తుంది. మనపై ప్రేమను పెంచుకున్న కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిలిస్తుంది. గెలవడం ధ్యేయం కావాలి.. కానీ గెలుపే జీవితం కాదు. ఓడినంత మాత్రాన జీవితం వృథా అనుకుంటే భవిష్యత్తు శూన్యంలా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసానికి మించిన విజయం లేదు. ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితం విలువ తెలుస్తుంది. ఏ సమస్యకూ ఆత్మహత్య పరిష్కారం కాదు. ఆత్మహత్య ఎందుకు చేసుకుంటారు? ఇది కచ్చితమైన సమాధానం లేని ప్రశ్న. ఇటీవల కాలంలో కుటుంబ కలహాలు, మానసిక ఒత్తిళ్ల కారణంగా విద్యార్థులే ఎక్కువగా ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

సంవత్సరం	ఏపీ	విజయవాడ	విశాఖ
2023	9108	673	479
2022	8908	634	461
2021	8067	385	378
2020	7043	324	306

20 శాతానికి పైగా పెరుగుదల

విశాఖలో బలవన్మరణాలు భయపెడుతున్నాయి. బలవన్మరణాల్లో రాష్ట్రంలో రెండో స్థానంలో విశాఖ ఉంది. ఏటా 20 శాతానికి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు జాతీయ నేర నమోదు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో సగం విద్యార్థులే కావడం బాధాకర విషయం. చదవ లేక కొందరు, సహచర విద్యార్థులు, ఫ్యాకల్టీ వేధింపులతో మరికొందరు, మార్కులు రాలేదని ఇంకొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

అలాగే ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో చాలా సందర్భాల్లో బలమైన కారణాలు కనిపించడం లేదని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తి బాగా మానసిక ఒత్తిడికి లోనైప్పుడు, సమస్యకు పరిష్కారం లభించనప్పుడు, తమకు ఏం చేయాలో, సమస్య నుంచి ఎలా బయట పడాలో తెలియక, దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఉద్యోగం లేదని, మానసిక రుగ్మతలు, మత్తు మందులకు బానిసవడం, విపరీతమైన భయం, ఎక్కువగా నిరాశకు గురికావడం, విపరీతమైన అప్పులు, జీవితంపై నమ్మకం సన్నగిల్లడం, వ్యవసాయంలో నష్టాలు, పరీక్షల్లో ఉత్తీర్ణత కాకపోవడం ఇలా అనేక కారణాలు ఉంటున్నాయి.

కుటుంబ సభ్యుల పాత్ర కీలకం

ఆత్మహత్యల నివారణకు ముఖ్యంగా కుటుంబ సభ్యుల పాత్ర కీలకం. నిరాశతో ఉన్న వారిని గమనిస్తూ ఉండాలి. వారిని దగ్గరకు తీసుకుని ఆత్మీయంగా ఓదార్చాలి. నేనున్నానంటూ భరోసా కల్పించాలి. సమస్య పరిష్కారానికి సూచనలు చేయాలి. కష్టాన్ని ఎలా ఎదుర్కోవాలో వారికి నేర్పాలి. విద్యార్థులైతే బాల్యం నుంచే వారిలో మనోధైర్యం నింపాలి. చిన్న చిన్న విషయాలే కాదు పెద్ద సమస్యలు వచ్చినా ఏ విధంగా ఎదుర్కోవాలో వివరిస్తూ ఉండాలి.

పాజిటివ్ ఆలోచనలతో నివారించవచ్చు



ఆత్మహత్యలలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. నెగిటివ్ ఆలోచనలకు దూరంగా ఉండాలి. పాజిటివ్ ఆలోచనలతో జీవితాన్ని మెరుగుపర్చుకోవచ్చు. ఆత్మహత్య ఆలోచనలు అసంకల్పితంగా ఉద్భవిస్తాయి. ఆ ఆలోచనలను తక్షణమే ఆపే మందులు అందుబాటులో ఉన్నాయి. ఆ తర్వాత కౌన్సెలింగ్ కూడా మెరుగైన జీవనానికి దోహదపడుతుంది.

– డాక్టర్ ఎస్.ఎస్.రాజు, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షుడు

శ్రీస్కంద గణపతిగా సంపత్ వినాయగర్

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల శ్రీ సంపత్ వినాయగర్ స్వామి సోమవారం స్కంద గణపతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే అధికసంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. ఉత్సవాలలో భాగంగా గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయ దాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 2,100 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ఈశ్వరుని నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే, శ్రీ సింహశైల సేవా సంఘం ఆధ్వర్యంలో లలితా సహస్రనామం, సామూహిక పారాయణం, కోలాటం, ప్రదర్శించారు. రాగసుధ, పి.లక్ష్మి బృందంచే భక్తిగీతాలాపాన జరిగింది.

చెస్ చాంపియన్‌షిప్‌లో అఖిల్‌కు పతకాలు



అఖిల్ ప్రసాద్

ఎంవీపీకాలనీ: శ్రీలంక వేదికగా జరిగిన కామన్ వెల్త్ యూత్ చెస్ చాంపియన్‌షిప్‌లో విశాఖ యువకుడు గారపాటి అఖిల్ ప్రసాద్ సత్తా చాటాడు. ఎంవీపీ కాలనీకి చెందిన అఖిల్ ప్రసాద్ చాంపియన్‌షిప్‌లో రెండు రజత పతకాలు సాధించాడు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 5 వరకు అండర్–12 కామన్ వెల్త్ యూత్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు శ్రీలంకలో జరిగాయి. క్లాసికల్ విభాగంలో 6.5 పాయింట్లతో 2వ స్థానాన్ని, రాపిడ్ విభాగంలో 5.5 పాయింట్లు సాధించి 2వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. రెండు రజత పతకాలు సాధించాడు. తల్లిదండ్రులు గారపాటి శ్రీధర్, లక్ష్మీచైతన్యలతో పాటు పలువురు నగర క్రీడా ప్రముఖులు అఖిల్ ప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.